క్లుప్తంగా

రుద్రాక్ష గణపతి



రుద్రాక్షల అలంకరణలో వినాయకుడు, శివలింగం

పిఠాపురం: గొల్లప్రోలు ఈబీసీ కాలనీకి చెందిన కోలా వీరబాబు రుద్రాక్షలతో వినాయకుడి విగ్రహాన్ని తయారు చేశాడు. దీనికోసం సుమారు 5 వేల రుద్రాక్షలను ఉపయోగించాడు. వీరబాబు తయారు చేసిన నాలుగు అడుగుల వినాయకుడు, మూడు అడుగుల శివలింగం ఎంతో ఆకట్టుకుంటున్నాయి. వీటిని వినాయకచవితి ఉత్సవాల్లో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపాడు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

భారత క్రికెటర్ భరత్



క్రికెటర్ భరత్‌ను సత్కరిస్తున్న విజయ్ ప్రకాష్ తదితరులు

పెద్దాపురం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని భారత క్రికెట్ జట్టు క్రీడాకారుడు కెఎస్ భరత్ పేర్కొన్నారు. స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో గురువారం ఆ విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశం తరపున 69 మ్యాచ్‌ల్లో 3,909 పరుగులు సాధించానని, కీపర్‌గా 232 క్యాచ్‌లు పట్టానని భరత్ పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలంటే క్రమశిక్షణ, నిరంతర సాధన, అంకితభావం అవసరమని ఆయన అన్నారు. జాతీయ హాకీ క్రీడాకారుడైన ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త కామిరెడ్డి రాజేష్‌తో పాటు విజయ్‌ప్రకాష్ తదితరులు ధ్యాన్‌చంద్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం భరత్‌ను సత్కరించారు. పాఠశాల సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, మేనేజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు చర్యలు

ఎమ్మెల్యే చిన రాజప్ప



మర్లావలో జల్ జీవన్ మిషన్ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే చిన రాజప్ప

పెద్దాపురం: గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకునేందుకు జల్‌జీవన్ మిషన్ పథకం దోహదపడుతుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. మండలంలోని మర్లావ, తూర్పుపాకల గ్రామాల్లో గురువారం ఈ పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో మంచినీటి పైపులైన్లకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అమృతోక్తులు సంకలనం ఆవిష్కరణ



అమృతోక్తులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: తెలుగు భాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు ఉపాధ్యాయులు సంకలనం చేసిన అమృతోక్తులు నీతి పద్యమాలిక పుస్తకాన్ని కలెక్టర్ షణ్మోహన్ గురువారం ఆవిష్కరించారు. స్థానిక రేచర్లపేట కాకినాడ నగరపాలక సంస్థ పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు మట్టపర్తి గంగారామ్, తామరాడ జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు దాడి చంద్రశేఖరరావు సంకలనం చేసిన ఈ పుస్తకాన్ని జేసీ రాహుల్ మీనా, డీఆర్వో తిప్పేనాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్‌తో కలిసి ఆయన గురువారం ఆవిష్కరించారు. ప్రాథమిక స్థాయి చిన్నారులు, పాఠశాల విద్యార్థుల్లో భాషా జ్ఞానం పెంపొందించేందుకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగకరమని కలెక్టర్ పేర్కొన్నారు.



ప్రజల్లో అవగాహన పెంచాలి

కోల్‌కతా వంటి ఘటనలు పునరావృతం కాకుండా మొదట ప్రజల్లో అవగాహన పెంపొందించాలి. రాత్రిపూట విధుల్లో ఉండే మహిళా వైద్యుల భద్రతపై పటిష్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలి. మహిళా భద్రతా సిబ్బందిని షిఫ్టుల వారీగా నియమించాలి.

– డాక్టర్ పి.మాధవి, హోమియో ఆసుపత్రి, దివిలి, పెద్దాపురం మండలం



ప్రభుత్వం బాధ్యతగా తీసుకోవాలి

మహిళా వైద్యుల రక్షణను ప్రభుత్వం బాధ్యతగా తీసుకోవాలి. లైంగిక హింసకు వ్యతిరేకంగా జీరో టాలరెన్స్ విధానం తప్పనిసరిగా అమలు చేయాలి. ఆసుపత్రుల్లో క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు, ఆత్మ రక్షణ కోసం శిక్షణ ఇవ్వాలి.

– డాక్టర్ పి.రాజేష్‌బాబు, లక్ష్మి ఆసుపత్రి వైద్యులు, పెద్దాపురం



చిత్తశుద్ధి అంతంతే..

- పాలిథిన్ కవర్ల వినియోగంతో అనర్థాలు
- విచ్చలవిడిగా వాడుతున్న ప్రజలు
- ఆరోగ్య సమస్యలనూ పట్టించుకోని వైనం
- అధికారుల నియంత్రణ చర్యలు అంతంతమాత్రం
- పర్యావరణానికి వాటిల్లుతున్న ముప్పు



పెద్దాపురం కబడ్డీ వీధిలో ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్రస్తుతం ప్రపంచాన్ని గడగడలాడిస్తోంది ప్లాస్టిక్ భూతం. ఒకప్పుడు ఏదో చిన్న సమస్యగా భావించిన ప్లాస్టిక్.. ఇప్పుడు పర్యావరణానికి ప్రధాన ముప్పుగా మారింది. ప్రపంచ మనుగడకే ప్రశ్నార్థకంగా మారిన ఈ సమస్య భావితరాలను ఎలా ముప్పుతిప్పలు పెట్టనుందోనని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్లాస్టిక్ మహమ్మారిని నియంత్రించడానికి వివిధ వర్గాల్లో కనీస సామాజిక బాధ్యత కానరావడం లేదన్నది జగమెరిగిన సత్యం.

పెద్దాపురం: ప్లాస్టిక్‌పై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని అమలు చేయడంలో అధికార యంత్రాంగంతో పాటు, ప్రజల్లోనూ చిత్తశుద్ధి కరవవుతోంది. మనిషి జీవితంలో పాలిథిన్ కవర్ల వినియోగం నిత్య కృత్యంగా మారింది. మార్కెట్ నుంచి ఇంటికి ఎలాంటి సరకులు తీసుకెళ్లాలన్నా పాలిథిన్ బ్యాగులనే ఆశ్రయిస్తున్నారు. పట్టణాల్లో వీటి వినియోగంపై కాస్తంత అడ్డుకట్ట వేయగలిగినా, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం యథేచ్ఛగా పాలిథిన్ బ్యాగుల వినియోగం కొనసాగుతోంది. దీనివల్ల పర్యావరణంతో పాటు, ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతుందని తెలిసినా, కనీసం పట్టించుకోకపోవడం విచారకరం.

నేరుగా విజయవాడ, విశాఖపట్నం నుంచి..

ప్రధాన నగరాలైన విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి పాలిథిన్ కవర్లు నేరుగా ఇక్కడి హోల్‌సేల్ దుకాణాలకు చేరుతున్నాయి. పెద్దాపురం, సామర్లకోట పట్టణాల్లోని హోల్‌సేల్ దుకాణాల నుంచి రిటైల్ వ్యాపారులకు, చిరు వర్తకులు, తోపుడు బండ్ల వారికి విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు హోల్‌సేల్ దుకాణాలపై దాడులు నిర్వహిస్తే, పాలిథిన్ కవర్ల విక్రయాలు చాలా వరకు తగ్గే అవకాశం ఉంది.

దాడులు అంతంతమాత్రం

నిషేధం నేపథ్యంలో ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు, వినియోగంపై సంబంధిత అధికారులు అంతంతమాత్రంగానే దాడులు చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని రెండు పట్టణాలు, ఆయా మండలాల్లోని గ్రామాల్లో మాత్రం చర్యలు చేపట్టిన దాఖలాల్లేవు. దీంతో వ్యాపారుల వ్యవహార శైలి మాత్రం మారడం లేదు. హోల్‌సేల్ దుకాణదారులపై పటిష్ట చర్యలు చేపట్టకుంటే, పాలిథిన్ కవర్ల వ్యాపారాలకు అడ్డూఅదుపూ ఉండదనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఇప్పటికైనా సంబంధింత అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టి, సంపూర్ణ ప్లాస్టిక్ రహిత, గ్రామాలుగా తీర్చిదిద్దాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

దుష్ప్రభావాలివీ..

పాలిథిన్ సంచుల వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. విచ్చలవిడిగా పడవేసిన పాలిథిన్ సంచులు భూమిలో కలవకపోవడం వలన హానికారక రసాయనాలు భూమిలో చేరి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. సకాలంలో వర్షాలు కురిసే అవకాశాలు తగ్గుతున్నాయి. ప్రజలకు ప్రాణాంతక రోగాలు సోకే ప్రమాదముంది. గ్రామాల్లో ప్లాస్టిక్ కవర్లను ఎక్కడపడితే అక్కడ పారవేయడం వల్ల వాటిని పశువులు భుజిస్తున్నాయి. దీనివల్ల పశువుల్లో అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రకృతిలోని గాలి, నీరు, నేల ఈ పాలిథిన్ కవర్ల వల్ల కలుషితమవుతున్నాయి.

ప్రజల్లో చైతన్యం తేవాలి



పాలిథిన్ కవర్ల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృత ప్రచారం చేసి, ప్రజలను చైతన్యవంతుల్ని చేయాల్సిన అవసరం ఉంది. వీటి నియంత్రణకు ప్రభుత్వం చేసిన చట్టాలను అధికారులు క్షేత్ర స్థాయిలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– తాడి కస్తూరి, సామాజిక కార్యకర్త, వీర్రాజుపేట, పెద్దాపురం

ఆరోగ్య సమస్యలు వస్తాయి



పాలిథిన్ క్యారీ బ్యాగుల వినియోగించడం వల్ల, వాటిలోని ప్రమాదకరమైన రసాయనాలతో ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. వీటి వినియోగంపైన ప్రజలు ఎవరికివారే అవగాహన పెంచుకోవాలి.

– డాక్టర్ సూర్యకుమారి, ఏరియా ఆస్పత్రి వైద్యురాలు, పెద్దాపురం

ప్రజల సహకారం అవసరం



పాలిథిన్ కవర్ల నియంత్రణలో ప్రజల సహకారం ఎంతో అవసరం. ప్లాస్టిక్ సంచులు కొనుగోలు మాని, క్లాత్ సంచులు వాడాలి. వ్యాపారులు ప్లాస్టిక్ సంచుల విక్రయాలు చేస్తే, వారిపై కఠిన చర్యలు తప్పవు. వ్యాపారులు, ప్రజలు సహకరించి ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి.

– కేవీ పద్మావతి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

రెవెన్యూ రికార్డుల భద్రతలో అప్రమత్తం

ట్రైనీ కలెక్టర్ భావన



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ భావన

పెద్దాపురం: రెవెన్యూ రికార్డుల భద్రతలో ఎటువంటి తేడాలు వచ్చినా సహించేది లేదని ట్రెయినీ కలెక్టర్ భావన హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్, రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉన్న రెవెన్యూ రికార్డులను ఆమె గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెద్దాపురం, కాకినాడ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల పరిధుల్లో సంవత్సరాల వారీగా అన్ని రికార్డులు కార్యాలయంలో ఉండాల్సిందేనని వాటిని భద్రపరచాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఎల్‌సీసీ, అసైన్‌మెంట్ ల్యాండ్, ఇళ్ల స్థలాలకు సంబంధించిన రికార్డులను మండల తహసీల్దార్, రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉంచాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. రికార్డుల పర్యవేక్షణకు నిత్యం ఇద్దరు సిబ్బందితో రాత్రిపూట ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. రికార్డుల భద్రతపై నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన ఆయా గదుల్లోని రికార్డుల భద్రతను పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, డీటీ కాంతారావు, సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛతా వారోత్సవాలు



మూలపేటలో ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న పంచాయతీ సిబ్బంది

కొత్తపల్లి: మండల పరిధిలో స్వచ్ఛతా వారోత్సవాల కార్యక్రమాన్ని గురువారం గ్రామాల్లో నిర్వహించారు. డ్రైన్ పేరుకుపోయిన చెత్తను కార్మికులు తొలగించారు. ప్రధాన కూడలి వద్ద పేరుకుపోయిన చెత్తను యంత్రాలతో తొలగించారు. ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

దాడి చేసినా, దూషించినా కేసు పెట్టరా?

కొమరగిరి వీఆర్వో ఆవేదన

కొత్తపల్లి: తనపై దాడి చేసి గాయపరచడమే కాకుండా కులం పేరుతో దూషించారని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మండలంలోని కొమరగిరి గ్రామ రెవన్యూ అధికారి పలివెల కిశోర్ కుమార్ గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు పిఠాపురం మండలం నవఖండ్రవాడ గ్రామానికి చెందిన వాసంశెట్టి బాబూరావు, తన సోదరుడు సూరిబాబుకు సంబంధించి కొమరగిరి రెవన్యూ పరిధిలో సర్వే నెంబర్ 149–2లో 2.4 ఎకరాల భూమి కొన్నేళ్లుగా వివాదంలో ఉంది. ఈ భూమి పట్టాదారు పాస్ పుస్తకం కోసం సూరిబాబు గతంలో దరఖాస్తు చేసుకున్నాడు. దీనిపై ఇంజెక్షన్ ఆర్డర్ ఉండడంతో అప్పటి తహసీల్దార్ పాస్ పుస్తకం మంజూరుకు నిరాకరించారు. దీనిపై ఆర్డీఓకు ఫిర్యాదు చేయగా దానిపై విచారణ నిర్వహించారు. దరఖాస్తులో సరిహద్దులు లేకపోవడం, పర్మినెంట్ ఇంజెక్షన్ ఆర్డర్ ఉండడం వల్ల పట్టాదారు పాసు పుస్తకం నిరాకరించినట్టు తేలింది. ఇందుకు తానే కారణమనే అపోహతో ఈ నెల 12న తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న జెరాక్స్ షాపులో ఉన్న తనపై బాబూరావు తన భార్య, బంధువలతో కలసి దాడిచేసి గాయపరచి, కులం పేరుతో దూషించారని పేర్కొన్నారు. అప్పటి నుంచి పోలీసులను సంప్రదిస్తున్నా ఓ ప్రభుత్వ ఉద్యోగిపై దాడి జరిగితే కేసు నమోదు చేయకపోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. దీనిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్టు ఆయన తెలిపారు. తహసీల్దారు చిన్నారావును వివరణ కోరగా ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నాం. దాడి చేసిన వారిపై తక్షణమే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని, ఈ విషయంపై ఎస్సైతో మాట్లాడినట్టు తెలిపారు. ఎస్సై వెంకటేష్‌ను వివరణ కోరగా దాడిపై రెవన్యూ అధికారి కిశోర్ కుమార్ గత ఎస్సై హయంలో ఫిర్యాదు చేశారని, విచారణ జరిపి కేసు నమొదు చేస్తానని తెలిపారు.

నేటితో ముగియనున్న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమార రామభీమేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సామూహిక వరలక్ష్మీ వత్రాలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఈ సామూహిక వ్రతాల్లో తమ పేర్లు నమోదు చేయించుకున్న మహిళలు ఉదయం 9 గంటలకు ఆలయానికి హాజరుకావాలన్నారు. పూజల్లో పాల్గొనే భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

గణపతి నవరాత్రులకు పసుపురాట



చవితి ఉత్సవాలకు పసుపు రాట వేస్తున్న మహిళలు

కొత్తపల్లి: గణపతి నవరాత్ర మహోత్సవాలకు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం పసుపురాటలు వేశారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద లక్ష్మీగణపతి నవరాత్రుల మహోత్సవాలకు ఉత్సవ యూత్ కమటీ ఆధ్వర్యంలో పసుపురాట వేశారు. 39వ గణపతి నవరాత్ర ఉత్సవాలను నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

గొడ్డటిపాలెం చిల్డ్రన్స్ హాస్టల్ విద్యార్థుల తరలింపు



గొడ్డటిపాలెం హాస్టల్ విద్యార్థులను ఇంటికి తీసుకువెళ్తున్నట్టు తల్లుల నుంచి అంగీకార పత్రం తీసుకుంటున్న సీడీపీఓ

కరప: అనుమతి లేకుండా నిర్వహిస్తున్న మండలం గొడ్డటిపాలెంలోని జీవనజ్యోతి చిల్డ్రన్స్ హాస్టల్‌ను అధికారులు తనిఖీ చేసి విద్యార్థులను ఇతర వసతిగృహాలకు తరలించారు. గురువారం ఐసీడీఎస్ కాకినాడ రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ వై.లక్ష్మి, ఐసీపీఎస్ ఓఆర్‌డబ్ల్యూ చిన్నబాబు, సెక్టార్ సూపర్‌వైజర్ కె.విజయలక్ష్మి తదితరులు సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు, వీఆర్వో డి.భరణితో కలసి ఆ హాస్టల్‌ను తనిఖీ చేసి అనుమతులు లేకపోవడం, కనీస వసతులు లేకపోవాన్ని తప్పుపట్టారు. ఆ హాస్టల్‌లో 14 మంది విద్యార్థుల్లో నలుగురిని కరపలోని షారోన్ హాస్టల్‌లోను, మరో నలుగురిని జగన్నాథపురంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో చేర్పించారు. ఐదుగురు బాలురను వారి తల్లులకు అప్పగించగా, ఇష్టపూర్వకంగా ఇంటికి తీసుకెళుతున్నట్టు వారి నుంచి అంగీకార పత్రం తీసుకున్నారు. ఇంగా 18 ఏళ్లు పైబడిన దివ్యాంగులు ఉన్నారని, వారిని వారికి తగ్గ హాస్టల్ ఎక్కడ ఉందో పరిశీలించి అక్కడ చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సీడీపీఓ తెలిపారు.

తెలుగుభాషకు వన్నె గిడుగు



రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు




సామర్లకోటలో విద్యార్థినికి బహుమతి ప్రదానం

పెద్దాపురం: తెలుగు భాషకు వన్నె తెచ్చిన గొప్ప వ్యక్తి గిడుగు రామ్మూర్తి పంతులని మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కమిషనర్ కేవీ పద్మావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగు భాషకు వన్నె తెచ్చేందుకు గిడుగు కృషి ఎనలేనిదన్నారు. తొలుత రామ్మూర్తి చిత్రపటానికి నివాళుర్పించారు. మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, డీఈ ఆదినారాయణ, కౌన్సిలర్లు విడదాసరి రాజా, త్సలికి సత్య భాస్కర్, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో..

సామర్లకోట: తెలుగు భాష అభివృద్ధికి కృషి చేసిన గిడుగు రామమూర్తి సేవలను ఉపాధ్యాయులు కొనియాడారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఇన్‌చార్జి హెచ్‌ఎం అధ్యక్షతన బాషా దినోత్సవాన్ని నిర్వహించి గిడుగు చిత్రపటానికి నివాళులు అర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పద్యాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు ఎం.నాగచైతన్య, వీవీడీ చాందిని జాతీయ గీతం సారే జహాసే అచ్చాను తెలుగు భాషలో అనువదించి పాడి అందరినీ అలరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన



హెల్మెట్ ధరించి ర్యాలీలో పాల్గొన్న పోలీసులు అధికారులు

కాకినాడ క్రైం: హెల్మెట్ ధారణపై ప్రజల్లో అవగాహనే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ గురువారం సాయంత్రం కాకినాడలో భారీ ర్యాలీ నిర్వహించింది. ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో డీఎస్పీ రఘువీర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సీఐ నూని రమేష్ బృందం కలిసి ద్విచక్ర వాహనాల ర్యాలీ చేపట్టారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ సర్పవరం వరకు అక్కడి నుంచి భానుగుడి జంక్షన్ వరకు కొనసాగింది. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో రఘువీర్ మాట్లాడుతూ హెల్మెట్లు ధరించడం వల్ల ప్రమాదాల్లో ప్రాణాపాయాలు నివారించవచ్చన్నారు. రోడ్డు ప్రమాదాల్లో చోటు చేసుకునే మరణాలు హెల్మెట్ ధరించకపోవడం వల్లే సంభవిస్తున్నాయని తెలిపారు.

మహిళలు, చిన్నారులకు రక్షణగా ఉందాం



పాదయాత్ర బృందానికి స్వాగతం పలికిన ఎస్ఎఫ్ఐ, ఆర్య వైశ్య సంఘాల ప్రతినిధులు

కాకినాడ సిటీ: మహిళలు, చిన్నారులపై జరిగే దాడులను అరికట్టాలని కోరుతూ కోల్‌కతా వైద్య విద్యార్థినిపై జరిగిన దాడిని ఖండిస్తూ విజయవాడ నుంచి కలకత్తా వరకు బుచ్చిబాబు, ఈడిగ ప్రదీప్‌కుమార్, డి.రాధాకృష్ణ చేపట్టిన పాదయాత్ర గురువారం కాకినాడ కలెక్టరేట్‌కు చేరుకుంది. ఈ 1400 కిలోమీటర్ల పాదయాత్రకు ఎస్ఎఫ్ఐ, ఆర్యవైశ్య సంఘం నాయకులు స్వాగతం పలికారు. పాదయాత్ర బృందం మాట్లాడుతూ సమాజంలో అమ్మాయిలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రచారం చేస్తూ ఈ యాత్ర చేపట్టినట్టు తెలిపారు. ఈ యాత్రకు మద్దతు తెలియజేసిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, ఆర్యవైశ్య సంఘం నాయకురాలు నాళం అండాళ్ సంయుక్తంగా మాట్లాడుతూ ముగ్గురు యువకులు పాదయాత్ర చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఆర్యవైశ్య సంఘం నాయకులు సంజయ్, రజిని, కౌశిక్, సునీత, సుజాత, అంబిక తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దాపురం: మండల పరిధిలోని దివిలి ప్రభుత్వ హోమియో వైద్యశాలలో యోగా శిక్షకులుగా పని చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు హోమియో ఆసుపత్రి వైద్యులు పి.మాధవి తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ యోగాలో పోస్ట్ గ్యాడ్యుయేషన్ డిప్లమో చేసి అనుభవం ఉన్నవారికి తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. నెలకు పురుష శిక్షకులకు 32 గంటలు, స్త్రీ శిక్షకులకు 20 గంటల చొప్పున పని చేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన వారికి గంటకు రూ.250 చొప్పున గౌరవ వేతనం ఇస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాల కోసం 94401 47206 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

కాకినాడ క్రైం: ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. సంబంధిత వివరాలిలా ఉన్నాయి. కాకినాడకు చెందిన గ్రంధి సత్యనారాయణ (39) స్థానిక రామకృష్ణారావు పేటలో నివసిస్తున్నాడు. వాకలపూడి జెమినీ ఆయిల్ ఫ్యాక్టరీలో ప్యాకింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి విధులకు వెళ్లి, రాత్రి తిరిగి ఇంటికి బయల్దేరాడు. అర్ధరాత్రి సమయంలో వాకలపూడి నుంచి రామకృష్ణారావు పేటకు వస్తుండగా కోకిలా బ్రిడ్జిపై ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు సత్యనారాయణను ఢీకొంది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై గురువారం సాయంత్రం కాకినాడ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సత్యనారాయణకు 11 ఏళ్ల క్రితం విజయనగరానికి చెందిన భానుతో వివాహం కాగా వారికి తొమ్మిదేళ్ల కుమార్తె సరయు, ఐదేళ్ల కుమారుడు దీక్షిత్ ఉన్నారు. వీరు స్థానిక సెంటాన్స్ పాఠశాలలో చదువుతున్నారు.

బీసీ హాస్టల్‌కు లైటింగ్

బోట్‌క్లబ్: ప్రభుత్వ బీసీ వసతి గృహంలో లైటింగ్ వసతిని కల్పించేందుకు సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ ముందుకు వచ్చారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని బీసీ వసతిగృహానికి విద్యుత్ లైటింగ్ లేని విషయాన్ని వార్డెన్ మహాలక్ష్మీ కాలేజ్ గ్రౌండ్ యూజర్స్‌కు వివరించారు. ఈ మేరకు స్పందించిన తలాటం హరీష్ సానా సతీష్ బాబు ఫౌండేషన్ సౌజన్యంతో రూ.10 వేలతో లైటింగ్ ఏర్పాట్లు చేశారు. ఈ లైటింగ్‌ను గ్రౌండ్ యూజర్స్ అసోసియేషన్ కార్యదర్శి పంపన సాయి, తలాటం హరీష్ గురువారం ప్రారంభించారు.

డిప్యూటీ కమిషనర్‌గా మనోహర్

కాకినాడ: నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా ఎస్.మనోహర్ నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో భాగంగా అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్‌ను ఇక్కడ నియమించారు. కాకినాడ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న గుంటూరు శేఖర్ స్థానంలో ఆయన నియమితులయ్యారు. ప్రస్తుత డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆయనను పుర పరిపాలనా శాఖకు రిపోర్ట్ చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది.